

మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఎన్ఎస్‌యూఐ జాతీయ కన్వీనర్ దినేష్‌సాగర్

# మీకందరికి అండగా ఉంటా

## బీఆర్ఎస్‌లో చేరినవారికి భరోసానిచ్చిన మంత్రి కేటీఆర్

షాద్‌నగర్, నవంబర్24: మీకందరికి అండగా ఉంటానని, భవిష్యత్‌లో మీరందరూ రాజకీయంగా ఎదిగేందుకు సంపూర్ణ సహకారం ఉంటుందని మంత్రి కేటీఆర్ పార్టీలో చేరిన ఎన్ఎస్‌యూఐ జాతీయ కన్వీనర్‌కు భరోసానిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దినేష్‌సాగర్ బీఆర్ఎస్ చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో నిజమైన కార్యకర్తకు గుర్తింపు లేదని, కిందిస్థాయి కార్యకర్తలను, నాయకులను పూర్తి విస్మరించిందని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి పార్టీకి అండగా ఉంటుందని, రాజకీయంగా ఎదుగేందుకు సంపూర్ణ సహకారం ఉంటుందని భరోసానిచ్చారు. పార్టీ గెలుపులో తమ వంతుగా పాత్ర పోషించి అంజయ్యయాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. దినేష్‌సాగర్ పార్టీలో చేరడం పట్ల సంతోషం వ్యక్తం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కేశంపేట ఎంపీపీ వై. రవీందర్‌యాదవ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి, దినేష్‌సాగర్ అనుచరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో యువ నాయకత్వానికి అవమానం

యువనాయకత్వం ఉంటేనే ఏ పార్టీ అయినా రాణిస్తుంది. కానీ వీర్లపల్లి శంకర్ అహంకార ధోరణి యువ నాయకత్వాన్ని పార్టీకి దూరం చేసింది.. అని ఎన్ఎస్‌యూఐ జాతీయ కన్వీనర్ దినేష్‌సాగర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి పార్టీని వీడడానికి గల కారణాలను వెల్లడించారు. గత దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధితో పని చేసి పార్టీ బలోపేతానికి శ్రమించామని, ఉద్యోగాలను, కుటుంబాలను వదులుకుని పార్టీయే జీవితం అనే విధంగా పార్టీ కోసం పని చేశామని, అయినప్పటికి కాంగ్రెస్ పార్టీ నాయకుల అహంకారపూరిత వ్యవహారశైలి వల్ల పార్టీని వీడడం బాధకరమన్నారు. తనతో పాటు కాట సుధీర్, మరో 300మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నామని వివరించారు. ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ గెలుపు తీవ్రంగా శ్రమిస్తామని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్‌తోనే సకల జనుల సంక్షేమం



మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ, పక్కన ఎమ్మెల్యే కాలె యాదయ్య

## మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్

### హోం మంత్రి మహమూద్ అలీ

## అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యమిస్తున్న సర్కార్ :ఎమ్మెల్యే కాలె యాదయ్య

### చేవెళ్ల కేజీఆర్ గార్డెన్‌లో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్ల రూరల్, నవంబర్ 24 : బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనే సకల జనుల సంక్షేమం సాధ్యమవుతున్నదని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. శుక్రవారం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ మైనార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు.తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, వర్గ, వర్ణ బేధాలు కుండా అన్ని వర్గాల ప్రజలను సమ ప్రాధాన్యతతో చూస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ ముస్లిం మైనార్టీల అభివృద్ధికి పాటుపడిన సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి , అండగా నిలబడిన ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి మరింత అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ మరోసారి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ముస్లిం మైనార్టీల మద్దతు బీఆర్ఎస్ పార్టీకి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దొళ్ల ప్రభాకర్, వైస్ ఎంపీపీ శివ ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకట రంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమణారెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ బాల్ రాజ్, బీఆర్ఎస్ మండల బీసీసెల్ అధ్యక్షుడు రాములు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శేరి శివారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివనీలచింటు, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రామాగౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫయాస్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఘని, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శేఖర్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు రాఘువేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మద్దెల జంగయ్య, వంగ శ్రీధర్ రెడ్డి, శేరి రాజు, సాయినాథ్, ఎల్లన్న, నర్సింహులు, మైనార్టీ నాయకులు ఎంఏ బాసిత్, అలీ, చేవెళ్ల జామ మసీద్ కమిటీ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాదర్, మల్కాపూర్ ఉప సర్పంచ్ సయ్యద్ జాఫర్, మైనార్టీ నాయకులు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనానికి హాజరైన ముస్లిం మైనార్టీలు

# కాంగ్రెస్‌లో గౌరవంలేదు : క్రాంతి రెడ్డి

## మంత్రి హరీశ్‌రావు సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరిక



క్రాంతిరెడ్డికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కొత్తూరు, నవంబర్ 24: కాంగ్రెస్‌లో చేరిన వారికి గౌరవం లభించడంలేదు అని కొత్తూరు యువ నాయకుడు మోర క్రాంతిరెడ్డి అన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డితో కలిసి క్రాంతిరెడ్డి ఈ మధ్యనే కాంగ్రెస్‌లో చేరారు. అక్కడ సీనియర్ నాయకుల వ్యవహార శైలి నచ్చక కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో మోర క్రాంతిరెడ్డి శుక్రవారం తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా క్రాంతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన అక్కడి సీనియర్‌ల నుంచి తనకు ఎలాంటి సహకారం లభించలేదన్నారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్‌ను వదిలి పెద్ద తప్పు చేశానని అన్నారు. తిరగి బీఆర్ఎస్‌లోకి చేరడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని వివరించారు.

# పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబర్ 24 : పోలింగ్ కేంద్రాల్లో 27వ తేదీ లోపు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం పోలింగ్ విధి విధానాలపై నియోజకవర్గ, మండల పర్యవేక్షణ, పోలింగ్ లోకేషన్ నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలతో పాటు లైటింగ్, ఫ్యాన్, ర్యాంప్, రెగ్యులర్‌గా నీటి సరఫరాతో కూడిన టాయిలెట్స్, తాగునీరు, టెంటు, ఫర్నిచర్ ను 27వ తేదీ లోపు సమకూర్చాలన్నారు. 28న సాయంత్రం 5 గంటలలోపు ప్రచారానికి గడువు ముగుస్తుందని, ఈ మేరకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ప్రచారాలను పూర్తిగా నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రచార కార్యక్రమాలు ముగిసిన అనంతరం హోటళ్లు, లాడ్జిలు, ఫంక్షన్ హాళ్లను తనిఖీ చేసి ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులను గుర్తించి నియోజకవర్గానికి వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లోని చెక్ పోస్టుల వద్ద సిబ్బంది కొరత లేకుండా పకడ్బందీగా నిఘా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ నెల 30 తేదీన నిర్వహించే పోలింగ్ విధులకు సిబ్బంది ఉదయం 5 గంటల లోపు కేంద్రంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, డీపీవో అరుణ్ కుమార్, పంచాయత్ రాజ్ ఈఈ ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.






సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి

# రూ.44.84 లక్షలు సీజ్

## తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి తరఫున పంచుతున్నట్లు ఒప్పుకున్న నిందితుడు

తాండూరు, నవంబర్ 24: తాండూరుకు చెందిన శెట్టి రవి నుంచి పోలీసులు రూ.44,84,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బషీరాబాద్ ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ వెల్లడించారు. రవి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా విధుల్లో ఉన్న పోలీసులు తనిఖీలు చేయగా నగదు పట్టుబడింది. దీనిపై విచారించగా తాండూరులో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న బుయ్యాని మనోహర్‌రెడ్డి డబ్బును బషీరాబాద్‌లోని ఓటర్లకు పంచేందుకు తీసుకెళ్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు చెప్పారు. శెట్టి రవిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడికి చెందిన ఆర్‌బీఎల్, ఎస్పీ ట్రేడర్స్‌పై ఐటీ దాడులు తాండూరులో కలకలం సృష్టించాయి.




పట్టుకున్న రూ.44.84 లక్షలను చూపిస్తున్న ఎస్సై వేణుగోపాల్‌గౌడ్